# కరీంనగర్‌లో కలకలం..

# ప్రభుత్వ టీచర్ ఆత్మహత్య



**– తనకు తానుగా గొడ్డలితో తలపై దాడి చేసుకుని మృతి**

కరీంనగర్ క్రైం,జూన్ 19,ప్రజాజ్యోతి: కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వావిలాలపల్లిలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తనకు తానుగా గొడ్డలితో తలపై దాడి చేసుకుని మృతి చెందింది. త్రీటౌన్ సిఐ తిరుమల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వావిలాలపల్లికి చెందిన వావిలాల సుధా (51) ప్రస్తుతం రామడుగు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యురాలిగా పనిచేస్తున్నారు.

ప్రజాజ్యోతి

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

శనివారం 20, జూన్ 2026 www.prajajyothinews.com పేజీలు :10



# కరీంనగర్ జిల్లాలో..

# ప్రజా పాలన జయకేతనం

- జిల్లాలో ప్రజా పాలన విజయవంతం
- ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికతో ప్రజల జీవితాల్లో మార్పు.
- ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతమైన కార్యాచరణ
- పారదర్శక పరిపాలన వేగవంతమైన సేవలు

కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (ప్రజాజ్యోతి ) 99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు నిరాటకంగా జరగడం విశేషం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసింది. జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో



## చేనేత కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం

– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

– కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన విప్



## భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

– రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**గంభీరావుపేట జూన్ 19 ( ప్రజా జ్యోతి);** గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ స్థూపం వద్ద శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, భావి భారత ప్రధాని, ప్రస్తుత ఎంపి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, మరియు రాష్ట్ర నాయకులు పరిష హనుమాన్లు, ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు . రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, కార్యకర్తల నడుమ కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,, దేశం కోసం ప్రాణం ఇచ్చిన కుటుంబం రాహుల్ గాంధీ గారి కుటుంబం అని, భారత దేశ ప్రజలను ఏకం చెయ్యడం కోసం భారత్ జోడో యాత్ర పాదయాత్ర చెయ్యడం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వ పోకడలపై నిరంతరం పోరాడుతూ, సామాన్య ప్రజలపక్షాన నిలుస్తున్న ప్రజానేత, భావి తరాల భవిష్యత్ నాయకులు రాహుల్ గాంధీ గారని, అన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల రాజ్వీర్, అక్కపల్లి బాలయ్య, గుర్రం రాజు గౌడ్, టేకుమల్ల ప్రవీణ్, సోషల్ మీడియా వారియర్ గౌరీశంకర్, బంగ్లా రాజు గౌడ్, గోపగారి లక్ష్మీనారాయణ గౌడ్, కొత్తపెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మేడ భాస్కర్, శ్రీనివాస్, గుడికాడి కుమార్, పిట్ల వెంకటి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజాం, రాజనర్సు, ఎడబోయిన ప్రభాకర్, కోటలింగం ,లక్కం నాంపల్లి, వేషాల వెంకటి, పెద్దవేని మల్లయ్య, నుస్రత్, శంకర్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ

### – రూ.20 లక్షలు మంజూరు

**రామగిరి, జూన్ 19 (ప్రజాజ్యోతి) :** రామగిరి మండలం బేగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేసిన నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి శివ మాట్లాడుతూ ప్రజా పాలనలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. బేగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. గతంలోనే పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు విద్యార్థుల కోసం ఆధునిక మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయించారని, అలాగే డిజిటల్ బోర్డులను ప్రవేశపెట్టారని



ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శైలజ, చైర్మన్ ఆడేపు చంద్రకళ, ఉపాధ్యాయుడు రాంకిషన్, పూజారి కోటగడ్డల శివ చందర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం

### – రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
### – కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన విప్



**వేములవాడ,జూన్,19:ప్రజాజ్యోతి.** చేనేత కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపారు..వేములవాడ పట్టణంలో ఇటీవల జరిగిన చేనేత పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఉప అధ్యక్షులు తాటికొండ రాజయ్య, కార్యదర్శి పారవెల్లి రాజేశం, కోశాధికారి రాపెల్లి దేవదాసు, కార్యవర్గ సభ్యులు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఘన స్వాగతం పలికారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతపారిశ్రామిక సహకార సంఘానికి చెందిన సభ్యులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారుప్రజా ప్రభుత్వంలో చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, నేతన్నల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు గత ప్రభుత్వం కాలంలో పేరుకుపోయిన చేనేత కార్మికుల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు చేపట్టిందని చెప్పారునేతన్నల చిరకాల కోరిక అయిన యారం డిపోను వేములవాడలో రూ. 50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయడం ద్వారా చేనేత రంగానికి కొత్త ఊపిరి పోశామని విప్ పేర్కొన్నారుచేనేత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు గతంలో ఒక కోటి చీరల ఆర్డర్లను ప్రభుత్వం ఇచ్చిందని, ప్రస్తుతం కూడా నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించేలా కొత్త ఆర్డర్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారునూతనంగా ఎన్నికైన చేనేత పారిశ్రామిక సహకార సంఘ కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేసిన ఆయన, వారి నాయకత్వంలో చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారుకాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు ప్రజల్లో ఆ పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, గ్రామీణ స్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ విధానాలను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ చేరికలతో వేములవాడ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు రాబోయే రోజుల్లో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ అధ్యక్షులు తుమ్ మధు, కౌనిల్సరు కొక్కుల బాలకృష్ణ, ఇప్పపూల అజయ్, చేనేత కార్యవర్గ సభ్యులు దూసా రాజేశం, పులి సత్యనారాయణ, తాటికొండ రామస్వామి తదితరులు పాల్గొన్నారు

## ఇల్లంతకుంటలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు -- ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



**ఇల్లంతకుంట జూన్ 19 (ప్రజజ్యోతి)** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, యువత అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందల ప్రసాద్, సర్పంచ్ వీ.రాజు, మండల మైనార్టీ అధ్యక్షులు జమల్, గ్రామశాఖ అధ్యక్షులు మామిడి నరేష్, సీనియర్ నాయకులు కునబోయిన బాలరాజు, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్, ఉస్మాన్, సతీష్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..

### – విద్యార్థులకు పుస్తకాలు, పండ్ల పంపిణీ



**జమ్మికుంట, జూన్ 19 ( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని యూత్ కాంగ్రెస్ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో మోత్కులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటం దేశానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహించిన భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలో ఐక్యత, సామరస్యం, ప్రేమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని కొనియాడారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక అసమానతల వంటి సమస్యలపై రాహుల్ గాంధీ నిరంతరం గళమెత్తుతున్నారని, యువత, రైతులు, మహిళల ఆకాంక్షలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి, దేశ సమగ్రత పరిరక్షణలో ఆయన పాత్ర కీలకమని పేర్కొంటూ, పార్టీ కార్యకర్తలు గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య, ప్రచార కమిటీ సభ్యులు సాయిని రవి, మండల అధ్యక్షుడు వీరమనేని పరుశురాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు, హుజూరాబాద్ ప్రధాన కార్యదర్శి రోమాల రాజ్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, దేవునూరి వినయ్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాన్ షాపులపై పోలీసుల మెరుపు దాడులు

– మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు విక్రేతలపై కొరడా

– 99 షాపుల తనిఖీ.. 52 కేసులు నమోదు



కరీంనగర్ క్రైం, జూన్19, ప్రజాజ్యోతి: మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాన్ షాపుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఏకకాలంలో మెరుపు దాడులు చేపట్టారు. తనిఖీల్లో మొత్తం 99 పాన్ షాపులను పరిశీలించగా, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై 52 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ వన్‌టౌన్‌లో 11, టూటౌన్‌లో 13, త్రీటౌన్‌లో 8, కొత్తపల్లిలో 3, హుజూరాబాద్‌లో 8, కేశవపట్నంలో 1, జమ్మికుంటలో 4, వీణవంకలో 1, ఇల్లందకుంటలో 3 కేసులు నమోదు చేశామన్నారు. యువతను మాదకద్రవ్యాలు, హానికరమైన పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత వస్తువుల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిషేధిత వస్తువుల విక్రయాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్-100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని పోలీస్ కమిషనర్ కోరారు,

## కొండా దేవేందర్ కి పిహెచ్ డి పరిశోధక పట్టా



కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 19 (ప్రజాజ్యోతి ) శాతవాహన విశ్వవిద్యాలయంలోని విశ్వవిద్యాలయ కళలు, సామాజికశాస్త్ర కళాశాల లోని సామాజిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ డిగ్రీని పరిశోధక విద్యార్థి కొండ దేవేందర్ కి అందజేశారు. తన పరిశోధన గ్రంథం " ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఆఫ్ మైగ్రేట్ వర్కర్స్ ఇన్ పోస్ట్ కోవిడ్ – ఏ స్టడీ ఆఫ్ ఎరస్ట్ వైలే కరీంనగర్ డిస్ట్రిక్ట్" అనే పరిశోధక అంశం తీసుకొని సమాజ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సూరేపల్లి సుజాత పర్యవేక్షణలో పరిశోధన చేసి మౌఖిక పరీక్షలో నిరూపించిన గ్రంథానికి డాక్టరేట్ డిగ్రీకి (పరిశోధక పట్టాకు) అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ డిగ్రీకి పర్యవేక్షణ వహించిన సామాజిక శాస్త్ర విభాగ బి.ఓ.ఎస్ & ప్రిన్సిపాల్ డా.కే. పద్మావతికి, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ కి, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ కి, అధ్యాపకులకు పరిశోధక విద్యార్థి కృతజ్ఞతలు తెలియజేశారు.

## 15 ఏళ్ల తర్వాత పోతుగల్ బాలికల పాఠశాలకు పునర్జీవం

– ఘనంగా గర్ల్స్ హైస్కూల్ పునఃప్రారంభం



ముస్తాబాద్, జూన్ 19 ( ప్రజా జ్యోతి ): ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో గత 15 సంవత్సరాలుగా మూతపడి ఉన్న బాలికల ఉన్నత పాఠశాల శుక్రవారం ఘనంగా పునఃప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ తహసీల్దార్ ఫారుక్, మండల అభివృద్ధి అధికారి లచ్చాలు, మండల విద్యాశాఖ అధికారి నిమ్మ రాజిరెడ్డి, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి హాజరయ్యారు. పాఠశాల పునఃప్రారంభం గ్రామ విద్యా అభివృద్ధికి కొత్త దిశగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోనే విద్యా సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల బాలికల చదువుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు. గ్రామంలో బడి ఉంటేనే పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోల కృష్ణ, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, గల్ఫ్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, వార్డు సభ్యులు జంగరాజు శేఖర్, గీసా అనిత, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ జ్యోతి వెంకటేష్, బాయ్స్ హైస్కూల్ చైర్మన్ భార్గవి, వార్డు విద్యాధర్, మాచర్ల బాలయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## "సర్" ప్రక్రియ సంపూర్ణ విజయవంతంకై, పటిష్ఠతకై, పారదర్శకతకై, రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని ఆర్డీఓ విజ్ఞప్తి



వేములవాడ, జూన్, 19: ప్రజాజ్యోతి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, విలువైనదని, వజ్రాయుధం లాంటిదని, హర్హులైన వారందరికీ ఓటు హక్కు లభించేలా కృషి చేయాలని ఆర్డీఓ పిలుపు ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండ ,పారదర్శకంగా జరిగేలా నిరంతరం క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాలు కృషి చేయాలని ఆర్డీఓ విజ్ఞప్తి! "సర్" ప్రక్రియ సంపూర్ణ విజయవంతంకై ప్రభుత్వ పరంగా బి ఎల్ ఓ లు, రాజకీయ పార్టీల పక్షాన బి ఎల్ ఏ లు సమన్వయంతో ఓటర్ల వివరాలను క్షున్నంగా పరిశీలించాలని ఆర్డీఓ విజ్ఞప్తి వేములవాడ ఆర్డీవో కె.ఎస్.బి. కుమారి జూన్ 25 నుండి జులై 24 వరకు ఇంటింటికీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వియవంతం చేయాలని, హర్హులైన వారందరికీ ఓటు హక్కు లభించేలా కృషి చేయాలని, సర్ ప్రక్రియ కార్యక్రమం పటిష్టవంతంగా ,పారదర్శకంగా ,సంపూర్ణంగా, పారదర్శకంగా, పటిస్తవంతంగా జరుగుటకు గాను ప్రభుత్వపరంగా బి ఎల్ ఓ లు, వివిధ రాజకీయ పార్టీల పరంగా బి ఎల్ ఏ లు కృషిచేయాలని, అన్ని వర్గాలు సర్ ప్రక్రియ విజయవంతకై భాగస్వాములు కావాలని ఈ రోజు వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష నేతల సమావేశంలో వేములవాడ ఆర్డీఓ కె. ఎస్. బి. కుమారి అన్నారు హర్హులైన ఓటర్ల పేర్లను మాత్రమే ఎన్నికల జాబితాలో ఉంచేందుకు, అనర్హుల పేర్లను తొలగించే లక్ష్యంతో సర్ ప్రక్రియ చేపడుతున్నామని ఆర్డీఓ అన్నారు. సర్ అనగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని, ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సరి చేయు విధానమని, ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా, వేములవాడ నియోజకవర్గంలోని 262 బూతులలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా బూతు స్థాయిలో నిశితంగా పరిశీలించాలని, బూతు స్థాయిలో బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు చురుకుగా పనిచేయాలని అర్హుల ఓట్లు జాబితా నుండి తొలగిపోకుండా చూడాలని ,అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించుటకు చర్యలు తీసుకోవాలని ఆర్డీ ఓ కోరారు. సమావేశంలో అఖిలపక్ష పార్టీ నేతలు పొలాస నరేందర్, మైలారం రాము, పిన్నింటి హన్మాండ్లు, చింతలకోటి రామస్వామి గౌడ్ లతో పాటు డిప్యూటీ తసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీం, శ్రావణ్ ఎలెక్షన్ సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు

## ముస్తాబాద్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

– కాంగ్రెస్ పార్టీ లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే: ఏళ్ల బాల్‌రెడ్డి



ముస్తాబాద్, జూన్19(ప్రజాజ్యోతి): ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏళ్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని అన్నారు. దేశ ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4,000 కిలోమీటర్లకు పైగా భారత్ జోడో యాత్ర నిర్వహించి ప్రజల సాధకబాధకాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఘనత రాహుల్ గాంధీదేనని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, సామాజిక న్యాయం సాధించడానికి రాహుల్ గాంధీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, యువజన విభాగం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

### – రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్



కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (ప్రజాజ్యోతి) రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్–కడాస్ట్రల్ గ్రామాల రీ–సర్వే, నక్షా కార్యక్రమాల అమలును వేగవంతం చేసి, ప్రజలకు రెవెన్యూ సేవలను పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పలు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, రీ–సర్వే కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి భూ యజమానికి సంబంధించిన ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి కార్యక్రమం కింద అందిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనను మరింత వేగవంతం చేసి, అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని పేర్కొన్నారు. నాన్–కడాస్ట్రల్ గ్రామాల్లో కొనసాగుతున్న రీ–సర్వే కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

### – పాఠశాలలకు 100మీటర్ల దూరంలో ఉన్న అన్ని షాప్స్ తనిఖీలు
### – హుజురాబాద్ ఏసీపీ మాధవి



జమ్మికుంట, జూన్ 19 (ప్రజాజ్యోతి): విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ ఏసీపీ మాధవి హెచ్చరించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు శుక్రవారం హుజురాబాద్ డివిజన్ లోని అన్ని విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలను పరిశీలించారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులకు సిగరెట్లు, గుట్కా తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె సూచించారు. తనిఖీల్లో విద్యాసంస్థల సమీపంలో విక్రయానికి ఉంచిన సిగరెట్లు, గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయం కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హుజురాబాద్ పట్టణ సీఐ కరుణాకర్, జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


## జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంది

### – పులిశారద, అంగన్వాడీటీచర్



**వేములవాడ, జూన్.19: ప్రజాజ్యోతి.** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ అర్బన్ కాలనీ వేములవాడ అంగన్వాడీ కేంద్రంలో పులి శారద చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పులి శారద మాట్లాడుతూ" జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని, అక్షరాభ్యాసం అనేది హిందూ సాంప్రదాయంలో పిల్లలకు విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టే పవిత్రమైన కార్యక్రమం అని, అక్షరం అంటే నాశనం లేనిదని, అభ్యాసం అంటే నేర్చుకోవడం అని, దీనినే విద్యారంభం లేదా అక్షరారంభం అని కూడా అంటారని, సాధారణంగా పిల్లలకు రెండు నుండి ఐదు సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఈ వేడుకను జరిపిస్తారని, ఈ కార్యక్రమానికి వసంత పంచమి, విజయదశమి లేదా పిల్లల జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం వంటి రోజులను చాలా శ్రేష్ఠమైనవిగా భావిస్తారని, పిల్లలను పూజా మందిరంలో కూర్చోబెట్టి, సరస్వతి దేవికి లేదా ఇష్టమైన దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, ఆ తర్వాత పండితులు లేదా పెద్దలు పిల్లల చేత పలక మీద బలపంతో "ఓం నమశ్శివాయ" లేదా "ఓం శ్రీ గణేశాయ నమః" అని మొదటి అక్షరాలు దిద్దిస్తారని, పాఠశాలలో బోధించడం మాత్రమే చదువు కాదని, వారిని జీవితంలో ఆచరించే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలని "పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, మహిళా సంఘాల సమాఖ్య రిసోర్స్ పర్సన్ గొడిసెల రేణుక తదితరులు పాల్గొన్నారు.

## చెత్త వేయడంతో పాల దుకాణానికి రూ.3,000 జరిమానా


సుల్తానాబాద్ పురపాలక సంఘం
MISCELLANEOUS RECEIPT
తే. 19/06/2026
కరీంనగర్ డెయిరీ
రూ. 3000/-
పాల ప్యాకెట్లు ...
3000/-

సుల్తానాబాద్, జూన్ 19:( ప్రజా జ్యోతి) పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కరీంనగర్ డెయిరీ పాల దుకాణం ముందు పాల ప్యాకెట్లు, ఇతర వ్యర్థాలను రోడ్డుపై పడవేయడాన్ని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ దుకాణ యజమానికి రూ. 3,000 జరిమానా విధించారు. ప్రజా పరిశుభ్రతకు విఘాతం కలిగించే విధంగా రోడ్లపై చెత్త వేయవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## కుల సంఘాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ



చొప్పదండి, జూన్ 19 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న రాజన్నల సంఘ భవనం, నాయి బ్రాహ్మణ సంఘ భవనాల నిర్మాణ పనులకు శుక్రవారం ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కొలిమికుంట గ్రామంలో జరుగుతున్న ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి పట్నాలకు హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, మున్సిపల్ పాలక వర్గం, మార్కెట్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రత్యేక చొరవతో విజయవంతమైన ధాన్యం కొనుగోళ్లు



, సుల్తానాబాద్ జూన్ 19: (ప్రజా జ్యోతి) జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తికావడంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణ కీలక పాత్ర పోషించిందని సహకార సంఘాల కార్యదర్శులు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం నుంచి ముగింపు వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ అవసరమైన సూచనలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మిల్లులకు ధాన్యం సకాలంలో తరలించేలా ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. అలాగే రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించారని తెలిపారు. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంతోనే ఈ యాసంగి సీజన్‌లో కొనుగోళ్లు వేగవంతంగా, పారదర్శకంగా సాగాయని వివరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రాత్రింబవళ్లు శ్రమించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కార్యదర్శులు, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది సేవలను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా కొనియాడారు. ట్యాబ్ ఎంట్రీలు, ధాన్యం నమోదు, రవాణా ఏర్పాట్లలో సమర్థవంతంగా పనిచేసి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

## విద్యార్థులలో కృత్రిమ మేధస్సు పాత్ర అత్యంత కీలకం



జమ్మికుంట, జూన్ 19 ( ప్రజాజ్యోతి ): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆధునిక సాంకేతిక ప్రపంచానికి సంసిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అన్న-అక్క మెంటార్‌షిప్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్ మాట్లాడుతూ, నేటి సమాజంలో కృత్రిమ మేధస్సు ప్రతి రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకొని భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. శిక్షకుడు పి. అవనికేత్‌ను కళాశాల తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెంటార్-మెంటీ ఇన్‌చార్జ్ డాక్టర్ శామల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రం, డాక్టర్ రాజకుమార్, నోడల్ అధికారులు వి. కిరణ్ కుమార్, ఎల్. రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు కె. ఉమాకిరణ్, డాక్టర్ మాధవి, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మమత, డాక్టర్ సుష్మ,డాక్టర్ రవిప్రకాశ్ రావు, ప్రశాంత్, రమేష్, సాయికుమార్, అ-నూష, అరుణ్ రాజ్, డాక్టర్ స్వప్న, దీనా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వాకర్స్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతిపత్రం

సుల్తానాబాద్, జూన్ 19: (ప్రజా జ్యోతి) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాకర్స్ ప్రతినిధులు మైదానంలో ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం చేస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరుకున్న జిమ్ పరికరాల వల్ల యువత, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ వాటిని మరమ్మతులు చేసి ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రౌండ్‌లో తాగునీటి సౌకర్యం, మెరుగైన లైటింగ్, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. వాకర్స్ సమస్యలను ఎమ్మెల్యే విజయరమణారావు



శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చొప్పరి సుమన్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కామణి శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజలింగం, ఉపాధ్యక్షుడు పల్ల సురేష్, ప్రచార కార్యదర్శి సుంక వేణు, యోగా కోచ్ దేవరకొండ ప్రకాష్, సీనియర్ క్రీడాకారుడు ఎండి ముస్తఫా, వాకర్స్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జేబులు ఖాళీ.. అధికారుల కళ్లకు గంతలు..!

**-ఎంఆర్‌పీకి మించి మద్యం విక్రయాలు.. పట్టించుకోని అధికారులు.**

**- ఫిర్యాదులు, కథనాలు వచ్చినా చర్యలు కరువు**



కోనరావుపేట, జూన్ .19(ప్రజాజ్యోతి)కోనరావుపేట మండలంలో మద్యం దుకాణాలు సిండికేట్ గా మారి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం కళ్లు మూసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం బాటిళ్లపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధికంగా వసూలు చేస్తున్నప్పటికీ, మద్యం సీసాలపై స్టిక్కర్ అంటించిన సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని మద్యం దుకాణాల్లో బీర్, విస్కీ, బ్రాందీ, రమ్ తదితర మద్యం బ్రాండ్లపై రూ. 10 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు బెల్ట్ షాప్ యజమానులు ,వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రోజూ వందలాది మంది వినియోగదారుల నుంచి వేల రూపాయల మేర అక్రమ వసూళ్లు జరుగుతున్నప్పటికీ, తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు మాత్రం మౌనంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. అధిక ధరల వసూళ్లపై పలుమార్లు ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ, స్థానిక పత్రికల్లో వరుసగా కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇప్పటి వరకు ఒక్క దుకాణంపై కూడా గట్టి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీంతో అక్రమ వసూళ్లకు అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**తనిఖీలు ఎక్కడ..?**

మద్యం దుకాణాలపై ఎక్సైజ్ శాఖ తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఎంఆర్‌పీకి మించి విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నా, వాటిని నిర్ధారించే ప్రయత్నాలు కనిపించడం లేదు.

**ప్రజల ప్రశ్నలకు సమాధానం ఏది..?**

అధిక ధరలకు మద్యం విక్రయించడం నిబంధనలకు విరుద్ధమైతే చర్యలు ఎందుకు లేవు.. ఫిర్యాదులు చేసినా స్పందన ఎందుకు లేదు.. అక్రమంగా వసూలు చేస్తున్న మొత్తాలు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయి. అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

**జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలి.**

స్థానికంగా పరిస్థితి అదుపు తప్పుతున్న నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే లైసెన్సులు సస్పెండ్ చేయాలని కోరుతున్నారు. ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న ఇప్పుడు కోనరావుపేట మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేస్తుందా.. లేక మౌనాన్నే కొనసాగిస్తుందా.. అన్నది వేచి చూడాల్సి ఉంది.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి

గొల్లపల్లి జూన్19 (ప్రజాజ్యోతి) గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామంలో ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామంలో మంత్రి పర్యటించారు ఈసందర్భంగా గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో రేవేళ్ల లావణ్య శ్రీధర్ దంపతులకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు



ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల స్వంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాహుల్ గాంధీ కి శుభాకాంక్షలు తెలిపారు

# ఎక్మో పద్ధతితో ఊపిరితిత్తుల మార్పిడి..

**– ప్రాణాపాయ రోగులకు నూతన ఆశలు**

**– యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ**




**కరీంనగర్ టౌన్ జూన్ 19 (ప్రజాజ్యోతి)** తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధులతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులను కాపాడటంలో 'ఎక్మో' (ఈసిఎంఒ) విధానం కీలక పాత్ర పోషిస్తోందని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. కరీంనగర్ యశోద హాస్పిటల్ బ్రాంచ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్న రోగులకు దాత అవయవం లభించే వరకు ఎక్మో ప్రాణాధారంగా పనిచేస్తుందని వివరించారు. చివరి దశ ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డి) లేదా శ్వాసకోశ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు 'వెనో-వీనస్ ఎక్మో' ద్వారా శరీరం వెలుపలే రక్తానికి ఆక్సిజన్ అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతారని తెలిపారు. ఈ విధానం ఊపిరితిత్తుల మార్పిడికి ముందు రోగుల ప్రాణాలను నిలబెట్టడంలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎక్మో సపోర్ట్‌పై ఉన్న రోగులకు డబుల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, వైద్యులు, అనస్థీషియా నిపుణులు, ఐసీయూ బృందం సమన్వయంతో మాత్రమే ఇది విజయవంతమవుతుందని చెప్పారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక క్రిటికల్ కేర్, రిహాబిలిటేషన్ ద్వారా రోగులు తిరిగి సాధారణ జీవితం గడపగలరని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం ప్రతినిధులు సుధీర్ రెడ్డి, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈవో



**చొప్పదండి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండల కేంద్రంలోని భవిత కేంద్రం, ఎంపీపీఎస్, చొప్పదండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) లను జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. భవిత కేంద్రంలో విద్యార్థులకు పల్లి చిక్కిలను అందజేశారు. ఎంపిపిఎస్ పాఠశాలలో శిథిలమైన భవనాన్ని తొలగించాలని సూచించారు. పాఠశాల తరగతి గదులు, కిచెన్ షెడ్, విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వీట్లు అందించి అభినందించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) లో జాతీయస్థాయిలో చిత్రలేఖన, వైజ్ఞానిక ప్రదర్శన లో బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ విద్యార్థుల నమోదును ఇంకా పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సుదీప్త ,సునీత పాల్గొన్నారు.

## 95 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**– మార్కెట్ కమిటీ చైర్మన్ కోమిరిశెట్టి విజయ**





**గంభీరావుపేట జూన్ 19 ( ప్రజా జ్యోతి):** ఆడపిల్ల పుట్టిందని భారంగా భావించకూడదని ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మిని మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. తహసిల్దార్ మారుతీ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని షాదీఖానాలో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఆడపిల్లకు పెళ్లి చేయాలన్న కష్టమైన ఈ రోజుల్లో ప్రభుత్వము కళ్యాణ లక్ష్మి పేరిట అందిస్తున్న లక్ష రూపాయలు ఎంతోకొంత ఖర్చులకు ఉపయోగపడతాయని అన్నారు. నిరుపేదలకు అండగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. ఆడపిల్ల పుట్టగానే తల్లిదండ్రులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, సమాజంలో మగ పిల్లల కంటే ఆడపిల్లలే చదువులు ఉద్యోగాల్లో రాణిస్తున్నట్లు పేర్కొన్నారు. గంభీరావుపేట మండల వ్యాప్తంగా 95 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లు గారి పద్మ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు హమీద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హనుమాన్లు, ఆర్ ఐ లు సత్యం, ప్రశాంత్ లతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్ ను ఉప సర్పంచ్ లు నాయకులు మేడ భాస్కర్, గుర్రం రాజు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజాం, లు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి యూరియా బుకింగ్ యాప్ అమలు



**సుల్తానాబాద్, జూన్ 19: (ప్రజా జ్యోతి)** రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు శుక్రవారం నుంచి యూరియా బుకింగ్ యాప్‌ను అమలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు. వానాకాలం-2026 సీజన్‌కు అవసరమైన యూరియా నిల్వలు మండలంలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రస్తుతం 182 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ సీజన్‌లో 24,410 ఎకరాల్లో వరి, 2,000 ఎకరాల్లో పత్తి సాగు అంచనా ఉండటంతో అవసరమైన మేరకు యూరియాను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రైతులు ముందస్తుగా యూరియా కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, అవసరమైన సమయంలో యాప్ ద్వారా బుక్ చేసుకుని తమకు నచ్చిన ఎరువుల దుకాణంలో పొందవచ్చన్నారు. ఒకసారి యూరియా పొందిన రైతు తిరిగి కొనుగోలు చేయాలంటే 15 రోజుల గడువు ఉండనున్నట్లు వివరించారు. దీంతో మండలంలోని ప్రతి రైతుకు సమానంగా యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా అవసరమైన సమయంలో మాత్రమే యూరియాను బుక్ చేసుకుని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి సూచించారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ




**వీణవంక, జూన్ 19 (ప్రజాజ్యోతి)** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విశేష ఆదరణ పొందిందని పేర్కొన్నారు. యువత, రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా రాహుల్ గాంధీ దేశ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని నాయకులు తెలిపారు. రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయుం -రోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## నంబర్ ప్లేట్లు లేని 80 వాహనాలు సీజ్



కరీంనగర్ క్రైం, జూన్ 19, ప్రజాజ్యోతి: నగరంలో నంబర్ ప్లేట్లు లేకుండా నడుస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఒకేరోజు 80 వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని, స్పష్టంగా కనిపించని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నేరాలకు ఉపయోగపడే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. వాహనదారులు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గంజాయి సేవించిన వ్యక్తి అరెస్ట్..

### కోర్టు ఆదేశాలతో డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం, జూన్ 19, ప్రజాజ్యోతి: కరీంనగర్ రూరల్ పోలీసులు గంజాయి సేవిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మొగ్దుంపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో పోలీసులు శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహించగా కొందరు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా అనుమానాస్పదంగా తిరుగుతున్న దుర్గం సాగర్ (25) అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పంచుల సమక్షంలో నిర్వహించిన డ్రగ్ టెస్టులో అతను గంజాయి సేవించినట్లు తేలింది. విచా రణలో గత కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లు తెలిపాడు, గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి తీసుకుని వినియోగిస్తున్న సమయంలో పోలీసులు రావడంతో దానిని పడేసి పారిపోవడానికి ప్రయత్నించాగా పోలీసులు పట్టుకున్నారు, అనంతరం అతనిపై కేసు నమోదు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా, నివేదికలో కూడా గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. తర్వాత నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, డీ–అడిక్షన్ సెంటర్‌కు పంపాలని న్యా యమూర్తి ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం లేదా మత్తు పదార్థాల సేవనం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు,

### గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



కొడిమ్యాల, జూన్ 19, (ప్రజాజ్యోతి): మండలంలోని సంద్రాలపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (అప్‌గ్రేడెడ్)లో 2026––27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు విద్యార్హతల అటెస్టెడ్ ధ్రువపత్రాల ప్రతులతో కేజీబీవీలో ప్రత్యక్షంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రేపాక పెద్దలింగపూర్ గ్రామపంచాయతీల వినూత్న తీర్మానం

### – రెండు గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలు బస్సులు నిషేధం

ఇల్లంతకుంట జూన్ 19 (ప్రజాజ్యోతి) ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక, పెద్దలింగాపూర్ గ్రామ పంచాయతీలు సంచలన నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రులను ప్రోత్సహించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రభావాన్ని తగ్గించాలని ఆయా గ్రామ పాలకవర్గాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి చదివించే కుటుంబాలకు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో తొలి ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. రేపాక సర్పంచ్ కథ మల్లేశం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అపోహలతో తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్నారని, ఈ పరిస్థితిని మార్చడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ విద్యపై అవగాహన పెంచడంతో పాటు, ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఇకపై గ్రామ పరిధిలో అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

**ప్రభుత్వ విద్యే ముద్దు..**

పెద్దలింగాపూర్ సర్పంచ్ గన్నేరం వసంత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలోనూ ఇదే తరహా తీర్మానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగితేనే నాణ్యమైన విద్యాబోధన సాధ్యమని ఆమె పేర్కొన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించే తల్లిదండ్రులకు గ్రామస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాల అమలులో వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. రెండు గ్రామ పంచాయతీలు తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఇది ఒక కీలక ముందడుగు అని ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతు న్నారు. గ్రామస్తులు కూడా ఈ నిర్ణయాలను స్వాగతిస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

## కరీంనగర్‌లో కలకలం.. ప్రభుత్వ టీచర్ ఆత్మహత్య

### – తనకు తానుగా గొడ్డలితో తలపై దాడి చేసుకుని మృతి





కరీంనగర్ క్రైం, జూన్ 19, ప్రజాజ్యోతి: కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వావిలాలపల్లిలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తనకు తానుగా గొడ్డలితో తలపై దాడి చేసుకుని మృతి చెందింది. త్రీటౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వావిలాలపల్లికి చెందిన వావిలాల సుధా (51) ప్రస్తుతం రామడుగు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగినప్పటికీ, భర్తతో విభేదాల కారణంగా కొద్దికాలానికే విడాకులు తీసుకున్నట్లు సమాచారం. సుధా చాలా కాలంగా మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్స పొంద ుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి వచ్చి నట్లు తెలిసింది. గత రెండు రోజులుగా ఆమె అసాధారణంగా ప్రవర్తించినట్లు, ఇంట్లోని కొన్ని వస్తువులు ధ్వంసం చేసినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో తండ్రి చూస్తుండగానే గొడ్డలితో తలపై దాడి చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్ర గాయాల కారణంగా ఆమె అక్కడికక్కడే మృతి చెంది నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

### – సర్పంచ్ కుంటెల్లి నాగరాజ్

కొనరావుపేట, జూన్.19 (ప్రజాజ్యోతి) ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని సర్పంచ్ కుంటెల్లి నాగరాజు, అన్నారు. శుక్రవారం కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతోపాటు స్నాక్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు, మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం ముందుకు వచ్చి, ఈ ఏడాది 34 మందిని కొత్తగా విద్యార్థులను బడిలో చేర్పించామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ తో పాటు ఆటో సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇద్దరు వాలంటీర్లను నియమించమన్నారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 వ తరగతి విద్యార్థులకు సాయంత్రం ఒక గంట స్టడీఅవర్ తో పాటు స్నాక్స్ అందిస్తామన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు పూర్తి చేసుకొని సాయంత్రం ఇంటికి వచ్చే వరకు విద్యార్థులు పాఠశాలలో ఉండేలా



చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎ–రవెల్లి విజయ్, మాసం బాబు, వంగాల ప్రణీత భూమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవం

- ఆధ్యాత్మిక శోభతో పులకించిన దేవాలయం
దేవాలయం కోరికలు తీర్చే కేంద్రం కాదు.. ఓ ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం.
- విడిపోతే పడిపోతాం... కలిసి ఉంటే బలంగా ఉంటాం..
జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి వ్యాఖ్యలు..





**కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (ప్రజాజ్యోతి )** కరింనగర్ ప్రజల ఆరాధ్య దైవాలు, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువుదీరిన దివ్య క్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయం". అఖండ భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో ఈ దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైభవంగా పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం 4:30 గంటలకు జగద్గురువుల కరకమలాల ద్వారా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు, అనంతనాగేంద్ర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8:00 గంటలకు స్వస్తిపుణ్యాహవాచనం, గణపతి పూజ, అఖండ దీపారాధన, సర్వతోభద్ర మండల పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. లోక కళ్యాణార్థం లక్ష్మిగణపతి హోమం, రుద్ర సహిత చండి హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించి, పూర్ణాహుతితో కార్యక్రమాన్ని సంపన్నం చేశారు. ఈ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు జగద్గురువుల దివ్యోపదేశం చేశారు. శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆ సందర్భంగా విద్యారణ భారతీయ స్వామి మాట్లాడుతూ "దేవాలయం అంటే కేవలం కోరికలు తీర్చుకునే కేంద్రం కాదు; అది ఒక గొప్ప ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం. ఇక్కడ లభించే ప్రశాంతతను మనం అనుభవంలోకి తెచ్చుకోవాలన్నారు. దైనందిన అలవాట్లలో మార్పు చేసుకోవాలన్నారు. "మనుషులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటానికి ప్రతిరోజూ సూర్య నమస్కారాలు ఆచరించాలని, దీనివల్ల మనకు అపారమైన శక్తి లభించడమే కాకుండా, అంతా శుభం జరుగుతుందన్నారు. "సమాజంలో మనం విడిపోతే పడిపోతాం.. అదే కలిసి ఉంటే బలంగా ఉంటాం. ఐక్యమత్యమే మహా బలం, ఇదే ధర్మ మార్గం" అన్నారు. మహిళలకు కూడా పై నినాదం వర్తిస్తుందన్నారు. ఎందుకంటే మహిళలు తమ వెంట్రుకలను గట్టిగా అల్లుకొని ముడి వేసుకుంటే వెంట్రుకలు బలంగా ఉంటాయని, లేదు ఫ్యాషన్ కోసం విరబోసుకునే విధంగా చేస్తే జుట్టు రాలిపోయి బలహీన పడతారని స్వామీజీ సందర్భంగా అన్నారు. తలకు నూనెకి పెట్టుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ నడవాలన్నా, వాహనాలు నడవాలన్నా ఆయిల్ ప్రాముఖ్యత ఎంత ఉందో, మనిషికి తలపై ఆయిల్ పెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమైందన్నారు. తలలో ఉండే మెదడు సరిగా పనిచేయాలన్న నూనె రాయడం తప్పనిసరి అన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# అత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు..

## - ఎస్సై శ్రీకాంత్

**గంభీరావుపేట జూన్ 19 (ప్రజాజ్యోతి);** గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కందుకుల దస్తగిరి (23), వృత్తి ఎలక్ట్రీషియన్, గతంలో కందుకుల సుమలత ఇంట్లో చోరీకి యత్నించిన కేసులో నిందితుడిగా అరెస్టై జైలుకు వెళ్లిబెయిల్‌పై విడుదలై అనంతరం ఆ కేసును ఉపసంహరించుకోవాలని పలుమార్లు బాధితురాలిని బెదిరించినప్పటికీ ఆమె అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్న నిందితుడు, ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు గ్రామంలోనీ బాధితురాలు తన ఇద్దరు పిల్లలతో ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో హ్యాక్సా బ్లేడ్ సహాయంతో కిటికీ ఇనుప గ్రిల్లులను కత్తిరించి ఇంటిలోకి ప్రవేశించి, ఆమె మెడను చేతులతో బిగించి హత్య చేయడానికిప్రయత్నించడంతో పాటు హ్యాక్సా బ్లేడ్‌తో గొంతు కోయడానికి యత్నించాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచిపరారయ్యాడు అని,. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం లింగన్నపేట గ్రామ శివారులోని ఖమాన్ ప్రాంతంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుండి నేరానికి ఉపయోగించిన హ్యాక్సా బ్లేడ్‌తో పాటు టీజీ-23-ఏ-4279 నంబరు గల బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో కూడాగంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.




# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సైదాపూర్‌లో దుకాణాలపై పోలీస్ ఆకస్మిక తనిఖీలు

పాఠశాలల పరిసరాల్లో గుట్కా మద్యం విక్రయాలపై కన్నెర్ర

దుకాణదారులకు కీలక సూచనలు చేసిన ఎస్సై కొప్పుల స్వాతి



**సైదాపూర్, జూన్19 (ప్రజాజ్యోతి)**విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సైదాపూర్ మండల పరిధిలోని పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ఎస్సై కొప్పుల స్వాతి శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల సమీపంలో ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో దుకాణదారులకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు, గుట్కా, మద్యం వంటి హానికరమైన పదార్థాలను విక్రయించవద్దని స్పష్టం చేశారు. తనిఖీల అనంతరం ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించిందని గుర్తు చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థులకు ఇలాంటి పదార్థాలను విక్రయిస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల సమీపంలోని పాన్ షాపులపై ఆకస్మిక తనిఖీలు

6 కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు



**వీణవంక, జూన్ 19 ( ప్రజాజ్యోతి )** వీణవంక మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో పాఠశాలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తనిఖీలు చేపట్టి సుమారు 6 కిలోల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పాఠశాల సమీపంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నందుకు మహ్మద్ ముస్తర్, మహ్మద్ జీలాని, మహ్మద్ మసీరుద్దీన్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ముఖ్యంగా విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పొగాకు ఉత్పత్తులను విక్రయించినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, పాఠశాలల పరిసరాల్లో పొగాకు రహిత వాతావరణం కల్పించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని పోలీసులు పేర్కొన్నారు.

## ప్రజానేత కు జన్మదిన శుభాకాంక్షలు శంకరపట్నం లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు,



శంకరపట్నం.జూన్ 19 (ప్రజా జ్యోతి)శంకరపట్నం మండలంలోని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు బండారి తిరుపతి మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి నినాదాలు చేశారు. ఈసందర్భంగామాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి. రైతులు, నిరుద్యోగుల కోసం ఆయన చేస్తున్న పోరాటం అందరికీ ఆదర్శం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనకు నిజమైన జన్మదిన కానుక"అని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలైన కన్నాపూర్, మొలంగూర్, తదితర గ్రామాల్లోనూ కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ చిత్రప టాలకు పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారి తిరుపతి మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్ బసవయ్య గౌడ్ నాయకులు సర్పంచ్‌లు యువజన కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) జిల్లా ఉపాధ్యక్షునీగా పురుమల్ల మనోహర్



గంగాధర జూన్ 19: (ప్రజా జ్యోతి): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగాధర మండలం ఆచంపల్లి గ్రామానికి చెందిన పురుమాళ్ల మనోహర్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మనోహర్ కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. తన నియామ్మకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారికి, మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గారికి, మా ప్రియతమ నాయకుడు డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం గారికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోహర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణపూర్‌లో కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

సుల్తానాబాద్, జూన్ 19: (ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన మీనుగు రమేష్ (36) కరెంట్ షాక్‌కు గురై మృతిచెందాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని కుంట వద్ద చేపలు పట్టేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవాహానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమేష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రమాద బాధితులకు భరోసా: హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం



గంగాధర జూన్ 19: (ప్రజా జ్యోతి): మండలంలోని వివిధ ప్రమాదాల్లో గాయపడి జిల్లా కేంద్రంలోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం గారు ఈరోజు ప్రత్యక్షంగా సందర్శించి పరామర్శించారు. గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య రోడ్డు ప్రమాదానికి గురై అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గారు తక్షణమే హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వం మరియు పార్టీ తరఫున బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య,మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బైరిశెట్టి సంపత్,బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనరావుపేటలో కొనుగోలు పూర్తి

### - హర్షం వ్యక్తం చేసిన రైతులు.



కొనరావుపేట.జూన్.19(ప్రజాజ్యోతి)కొనరావు పేట మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు విజయవంతంగా పూర్తి చేసుకున్నామని సింగల్ విండో డైరెక్టర్ రమేష్ రెడ్డి , తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింగల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రం పూర్తయిందని జిల్లా అధికారులు, రైతులు హమాలీ కార్మికుల కృషితో కొనుగోలు పూర్తయిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు పూర్తి చేశామని, రానున్న రోజుల్లో కూడా రైతులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో సీఈఓ కేశవులు సింగల్ విండో సిబ్బంది రైతులు, గ్రామస్తులు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా



ఇల్లందకుంట, జూన్ 19(ప్రజాజ్యోతి): భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతులు, కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టి సామాన్య ప్రజల గొంతుకగా నిలిచారని కొనియాడారు. యువతలో చైతన్యం నింపుతూ దేశ భవిష్యత్తు కోసం కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తున్న రాహుల్ గాంధీ, సమాన అవకాశాలు కలిగిన భారతదేశ నిర్మాణమే తన లక్ష్యమని పలుమార్లు స్పష్టం చేశారని తెలిపారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని అన్నారు. ఈ శుభ సందర్భంగా రాహుల్ గాంధీకి భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి దేశ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కనుమల్ల రామకృష్ణ, పెద్ది శివకుమార్, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, గుత్తికొండ రవికుమార్, ఎండి అజ్గర్ పాషా, మీస రాజయ్య, బైరెడ్డి కొండారెడ్డి, మర్రి వీరారెడ్డి, మేకల సురేష్, మూడెడ్ల రమేష్, బండి మల్లయ్య, గురుకుంట్ల స్వామి, ఆకుల రాము, మిట్ట మోహన్‌రావు, భోగం సాయిరా, జిల్లెల సందీప్‌రెడ్డి, కారింగుల రాజేందర్, గోలి కిరణ్, గౌడిశాల పరమేశ్వర్, సింగిరెడ్డి గోపాలరెడ్డి, గౌడుగు మానస, భోగం పృథ్వీరాజ్, ఆరే రమేశ్‌రెడ్డి, గూడెపు ఓదేలు, మారపల్లి వేణు, రేణికుంట్ల రవీందర్, ధార నరేష్, జక్కు కుమారస్వామి, మారపల్లి వంశీ, జిల్లెల జలేందర్‌రెడ్డి, దాసరి తిరుపతి రెడ్డి, మడిపల్లి కుమార్, తోట రాజు, బోయిని విష్ణు, బూర్గుల రాజు, తెప్ప విజయ్, భోగం రాజేందర్, కాశమల్ల సతీష్, భోగం చిరంజీవి, వంతడుపుల రాజు, పోడేటి కుమార్, కాటిపల్లి రాజేశ్వర్ రెడ్డి, కరింగుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు.

– మద్యం సేవించి పట్టుబడిన 143 మంది మందు బాబులకు జరిమానాలు.
– వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్.

**వేములవాడ,జూన్,19:ప్రజాజ్యోతి.** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకే నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 143 మందు బాబులను ఈరోజు లోక్ అదాలత్ లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ మేఘన జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ తెలిపారు. విధించినజరిమానాల వివరాలు. ఇరువైమంది కిఒక్కొక్కరికినాల్గవేల రూపాయలజరిమాన. ఒక్కరికిఅయిదువేలరూపాయలజరిమానా. యాభైమూడుమందికి ఒక్కొక్కరికిమూడువేలరూపాయలజరిమానా. యాభైతొమ్మిదిమందికి ఒక్కొక్కరికిరెండువేలరూపాయలజరిమాన. ఐదుగురికిఒక్కొక్కరికిరెండువేలఅయిదువందలరూపాయలజరిమాన. ముగ్గురికిఒక్కొక్కరికి మూడువేలఅయిదువందలరూపాయల జరిమాన. జిల్లాలో రోడ్డు ప్రమాదాలనివారణేలక్ష్య ంగానిర్వహిస్తున్న"ఎరైవ్ అలైవ్"కార్యక్రమంలోభాగంగామద్యంసేవించివాహనాలునడపడంవల్లకలిగేప్రమాదాలపైవిస్తృతఅవగాహనకార్యక్రమాలుచేపడుతున్నట్లుతెలిపారు.



మద్యంసేవించివాహ నాలునడు పుతూప్రమాదాలకు గురైకుటుంబాలను రోడ్డున పడేయొద్దని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంవల్ల తమతోపాటుఎదురుగావచ్చేవారి కుటుంబాల్లో కూడా విషాదం నింపవద్దని హెచ్చరించారు. మద్యంసేవించికేసులపల ౖఅయితే భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధి అవకాశాలపైప్రభా వంపడేఅవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలోఇబ్బ ందులుతలెత్తవచ్చని హెచ్చరించారు. ట్రాఫిక్,రోడ్ భద్రతనియమనిబ ంధనలన ౖఉల్లంఘించేవారి ౖపైకఠినచట్టపరమైనచ ౖర్యలుతీసుకోవడంజ రుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టే షన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,వాహన తనిఖీలు నిర్వహించాడంజ రిగుతుందని మద్యంసేవించివాహనంనడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలుతీసుకోవడంజరుగుతుందన్నారు.

# మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

– కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
– సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్



**కరీంనగర్ టౌన్, జూన్ 19( ప్రజాజ్యోతి )** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తమ న్యాయమైన మున్సిపల్ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎదుట చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి , సిపిఎం జిల్లా కమిటీ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూనే,కార్మిక వర్గాన్ని మరింత కట్టు బానిసలుగా చేసే చట్టాలు చేస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్రానికి పూర్వం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గానికి ఎలాంటి ప్రయోజనం లేకపోగా కార్పొరేట్లకు, పెట్టుబడుదారుల దోపిడీకి మార్గం సుగమం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ హామీలు అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో కార్మికులు, ఆర్థికంగా నష్టపోతున్నారనీ అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని జిల్లాలో ఏర్పాటు చేయడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పూర్తిగా విఫలమైనాడన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. వెంటనే జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఎన్ ఎం ఆర్ పిక్స్ పే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండవ పిఆర్సి ప్రకటించి,కనీస వేతనం నెలకు 26,000 ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో పని చేసే కార్మికులందరూ పేద బడుగు బలహీన వర్గాల వారేనని అందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ లో పనిచేసే కార్మికులకు ప్రతి సంవత్సరం రక్షణ పరికరాలు, గ్లౌజులు, బెల్లం, రైన్ కోట్, కొబ్బరి నూనె, చెప్పుల లాంటి ఇతరత్రా కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం దాటిన కార్మిక వర్గం సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. కార్మిక వర్గం సంఘటితమై న్యాయమైన హక్కులు సాధించుకోవడం కోసం ఉద్యమాలు, పోరాటాలు ఉద్ధృతం చేయాలని, కార్మిక వర్గ పోరాటాలకు సిపిఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి నరేష్ పటేల్, టౌన్ కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్యలు పాల్గొన్నారు.

## పల్లిమక్తలో ప్రజా నేతకు పుట్టినరోజు వేడుకలు

– కాంగ్రెస్ నేతల సంబరాలు

**కొనరావుపేట, జూన్.19(ప్రజాజ్యోతి)** కోనరావు పేట మండలం పల్లిమక్త గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ,చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ రైతులు నిరు ద్యోగుల కోసం ఆయన చేస్తున్న పోరాటం అందరికి ఆదర్శం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన జన్మదిన



కానుకాని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చిద్రపేణి ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ వాసం పెల్లి శ్రీనివాస్, వార్డ్ సభ్యులు మొకనపెల్లి బాలరాజు, నాయకులు నందగిరి అంజయ్య,మొకనపెల్లి కిషన్, ఎనగంటి నారాయణ, ఏరెడ్డి శ్రీనివాస్ , బాలకిషన్, విజయ్,లక్ష్మణ్,అజయ్,కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# వరుణదేవుని కరుణ కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భోగంపాడు గ్రామస్తుల ప్రార్థనలు



**ఇల్లందకుంట, జూన్19(ప్రజాజ్యోతి):** వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుతూ ఇల్లందకుంట మండలంలోని భోగంపాడు గ్రామ ప్రజలు శుక్రవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణదేవుడు కనికరించి సమయానికి వర్షాలు కురిపించాలని వేడుకుంటూ గ్రామ మహిళలు, పెద్దలు గ్రామంలోని దేవతల విగ్రహాలకు నీళ్లు పోసి మొక్కులు చెల్లించారు. గ్రామదేవతలైన భూలక్ష్మి, మహాలక్ష్మి సమేత వాస్తు పురుష భగవాన్ (బొడ్రాయి), హనుమాన్ స్వామి, పోచమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, మదనమ్మ తల్లి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ రైతులు పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని దేవతల ఆశీర్వాదాలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏలేటి నిర్మల రఘుపతి రెడ్డి, ఉపసర్పంచ్ కాసం ఇంద్రారెడ్డి, మాజీ సర్పంచులు ఎప్పటి మధుసూదన్ రెడ్డి, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, సొసైటీ చైర్మన్ కళ్లెం సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

# హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల పరిశీలన



**కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 19(ప్రజాజ్యోతి ):**-కరీంనగర్ నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను శుక్రవారం నగంపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. నగరపాలక సంస్థకు చెందిన సుమారు రూ. 1.43 కోట్ల నిధులతో అత్యాధునిక హంగులతో నిర్మాణం చేస్తున్న హెల్త్ సెంటర్ భవనం అభివృద్ధి పనులను తనిఖీ చేసి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో భవన నిర్మాణ అభివృద్ధి పనుల వేగవంతం పై సూచన లు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫు ల్ దేశాయ్ మాట్లాడుతూ... అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మా ణాన్ని రెండు నెలల్లో పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీస్కోవలన్నారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని... ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణం పనులను నిర్ధేశిత గడువులోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ యూ వైస్ చాన్సలర్ ప్రొ" ఉమేష్ కుమార్, నరపాలక సంస్థ డీఈ శ్రీనివాస్, ఏఈ నర్మద, సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన జయకేతనం

- జిల్లాలో ప్రజా పాలన విజయవంతం
- ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికతో ప్రజల జీవితాల్లో మార్పు.
- ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతమైన కార్యాచరణ
- పారదర్శక పరిపాలన వేగవంతమైన సేవలు.

కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (ప్రజాజ్యోతి ) 99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు నిరాటకంగా జరగడం విశేషం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసింది. జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ఈ కార్యక్రమం ముగిసింది. 10 ప్రధాన అంశాలపై షెడ్యూల్ వారీగా నిర్వహించి పాలన ప్రజలకు మరింత చేరువైంది. కరీంనగర్ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు అమలైన ఈ కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అద్భుతంగా జరిగింది. తద్వారా కరీంనగర్ జిల్లా ప్రగతి ప్రధాన నిలిచేందుకు దోహదపడింది. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. మంత్రుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

**మంత్రుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం**

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు 2026 మార్చి 6న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ , చింతకుంట విజయ రమణారావు ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు , ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పలువురు అధికారులు హాజరయ్యారు.

**పరిశుభ్రత ఫైళ్ల పరిష్కారంలో ప్రధాన పాత్ర.**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మొట్టమొదటి అంశం ఫైళ్ళ పరిష్కారం పరిశుభ్రత కార్యక్రమం. జిల్లాలోని 318 గ్రామపంచాయతీలు కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు హుజురాబాద్



జమ్మికుంట చొప్పదండి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్లు, హాస్టళ్లు, శ్మశానవాటికలు, బస్టాండ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతకు నోచుకోని ఆయా కేంద్రాలు ప్రస్తుతం శోభాయమానంగా తయారయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పాత సామగ్రిని తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఫైళ్ల పరిష్కారానికి ప్రధానంగా కృషి చేశారు. జనన--మరణ ధ్రువపత్రాలు, వ్యాపార లైసెన్సులు, మ్యుటేషన్లు, లేఅవుట్ అనుమతులు, ఈ-ఆఫీస్ ఫైళ్లతో కలిపి మొత్తం 4,290 ఫైళ్లను జిల్లాలో పరిష్కరించారు. భూభారతి కింద అందిన 239 దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఇంటి వద్దే చెత్త వర్గీకరణ, హోం కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధం, ఈ-వేస్ట్ సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రైనేజీల పూడికతీత కార్యక్రమాలు చేపట్టారు. అరైవ్ అలైవ్ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో

**ముందడుగు..**

ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందడుగు పడింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో నూతన మార్పు తీసుకొచ్చారు. 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామసభలు నిర్వహించి 2,986 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 19 ప్రాంతాల్లో గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ, రాహవీర్, పీఎం రాహత్ పథకాలపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గింది. జీరో ఎన్ఫోర్స్మెంట్ డే సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులను పూలతో అభినందించారు. అత్యధికంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించి వాటి నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, పిల్లల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ, విడిచిపెట్టబడిన పిల్లలపై సర్వే చేపట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సమావేశాలు నిర్వహించారు.

**అన్నదాతకు అండగా..**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రైతు వారోత్సవాల్లో భాగంగా అన్నదాతకు అండగా నిలిచారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ను ప్రారంభించారు. 76 రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, వినియోగదారులు ఇష్టపడే వరి రకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహించారు. అదేవిధంగా ఫామ్ ఆయిల్ పంటను అత్యధికంగా పండించాలని అధికారులు గ్రామ గ్రామానా విస్తృత ప్రచారం నిర్వహించారు. హార్టికల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖలు ప్రత్యేక







కార్యక్రమాలు నిర్వహించాయి. "ఖేతీ బచావో అభియాన్" ద్వారా జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. రైతు భరోసా పథకం ద్వారా 1,93, 544 మంది రైతులకు 143. 55 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మరణించిన 206 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు 13. 35 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. అదేవిధంగా ఈ సీజన్లో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. తద్వారా 554 కోట్లు రైతులకు ప్రభుత్వం అందించింది. అదేవిధంగా 23,710 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేశారు.

**సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం..లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం.**

సంక్షేమ పథకాల అమల్లో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం అందిస్తోంది. జిల్లాలో కొత్తగా 45,920 రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. రేషన్ కార్డులో 96,775 కొత్త సభ్యుల పేర్లను చేర్చారు. 3. 20 లక్షల కుటుంబాలకు ప్రతినెల 6,021 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మహిళల ఆర్థిక సాధికారత కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు చేసిన 7. 39 కోట్ల ఉచిత ప్రయాణాలకు గాను రూ. 334 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాలో 1. 58 లక్షల మంది లబ్ధిదారులకు 9.23 లక్షల గ్యాస్ సిలిండర్లను రూ. 500 రూపాయలకే అందిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం 29. 78 కోట్ల వెచ్చిస్తున్నది. అదేవిధంగా గృహ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1.73,627 మంది వినియోగదా రులకు రూ. 153 కోట్ల లబ్ది చేకూరింది. ఇందిరమ్మ పథకం కింద జిల్లాలో 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 7000 కి పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 2100 కుటుంబాలు గృహప్రవేశం పూర్తి చేసుకున్నాయి. 100% ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

# సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాట యోధుడు రాహుల్

### ... కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు

రాయికల్, జూన్ 19 (ప్రజా జ్యోతి) ప్రజాస్వామ్య విలువలు,రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాయికల్ పట్టణంలో గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి మార్గదర్శనం చేయగలిగిన యువ తేజం రాహుల్ గాంధీ అని ఆయన దెబ్బకు బిజెపి పార్టీ ఇతర పార్టీలతో జట్టు కట్ట వలసి దుస్థితి వచ్చిందని అన్నారు. దేశ స్వతంత్ర అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వాలు రక్షణ రంగంలో భారత్ ను ఒక అజేయశక్తి గా నిలిపాయన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించల్సిన కేంద్ర ప్రభుత్వం యువతను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు .నిరుద్యోగ సమస్యను గుర్తించడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశంలో సుస్థిరమైన ప్రజా పాలన అందించగల ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని మత చాందస వాదులు మతాల పేరు చెప్పి గెలిచే ప్రయత్నం చేసిన బడుగు బలహీనవర్గాల సంక్షేమం పట్ల ఆలోచన గలిగిన రాహుల్ గాంధీ దేశంలోనే అత్యున్నతమైన నాయకుడిగా పేరుపొందిరని అన్నారు. దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు మరింత బలంగా,అభివృద్ధి దిశగా సాగాలంటే రాహుల్ గాంధీ వంటి నాయకత్వం అవసరమని అన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే దూరదృష్టి, ప్రజల పట్ల అంకితభావం కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,కోల శ్రీనివాస్,సర్పంచ్ భారతపు రాజేష్, నాయకులు బాపురపు నర్సయ్య,తలారి రాజేష్,పడిగెల రవీందర్,మున్ను,సామల్ల వేణు,అల్లె పురుషోత్తం,సింగని రమేష్,ఇర్ఫాన్,బొద్దుల శివ,కాశ వేణి రాజేష్,ఆరె శ్రీనివాస్,మన్నెగుండ్ల నర్సయ్య, బోదాసు జలపతి,ప్రసాద్, భూమేష్,ఇద్దయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి అడ్లూరి

జగిత్యాల రూరల్ జూన్19(ప్రజాజ్యోతి): శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్రసాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో సహస్ర లింగాల దేవాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి గారితో పాటు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు కరువు కాటకాలు రాకుండా చూడాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో



జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ఆడువాల జ్యోతి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత.

జగిత్యాల రూరల్, జూన్19, ప్రజాజ్యోతి.

శనివారం రోజున 33/11 కేవీ కల్లెడ మరియు లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ ఉన్నందువలన కల్లెడ తక్కలపల్లి, సోమనపల్లి, సంగంపల్లి, హబ్సీపూర్ గుట్రాజపల్లి అనంతరం మరియు లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం తిమ్మాపూర్ గ్రామాలలో మధ్యాహ్నం 04. 00 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున విద్యుత్ వినియోదారులు సహకరించగలరు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కొడిమ్యాల, జూన్ 19,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేయడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి,మార్కెట్ కమిటి ఉపాధ్యక్షుడు కొండూరి రాజేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల అజయ్,నాయకులు చిలివేరి నారాయణ, పర్లపల్లి ప్రసాద్, జమాల్పూరి రాజేందర్,తాళ్లపెల్లి అంజయ్య,తిరుమలేష్, అంతడుపుల జలెందర్, చిర్ర చింటు, అనుమ ఒల్ల అజయ్,వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ గుడి ప్రతిష్టాపన



(కోరుట్ల రూరల్, ప్రజాజ్యోతి, జూన్19) కోరుట్ల మండలంలోని సర్పరాజ్ పల్లి గ్రామంలో గంగమ్మ గుడి ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా లా గంగమ్మ గుడి కి డప్పు సప్పులతోని బోనాలతో పిల్లాపాపలతో కలిసి సంబురంగా పండగ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ , ఉపసర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ



(కోరుట్ల రూరల్, ప్రజాజ్యోతి.,జూన్19) కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సర్పంచ్ చిట్నేని లత రమేష్, ఉప సర్పంచ్ జంగస్వామి, కార్యదర్శి సరిత, వార్డ్ మెంబర్స్ చిట్నేని రమేష్, సోమిశెట్టి చిన్న మల్లయ్య, క్యాతం రమేష్, పుల్లూరి నర్సయ్య, బాజోజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం ప్రాథమిక పాఠశాలలో నూతన ప్రీ ప్రైమరీ తరగతి ప్రారంభోత్సవం





(కోరుట్ల రూరల్ ,ప్రజా జ్యోతి ,జూన్ 19) కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి గది గ్రామ సర్పంచ్ దోడ రంజిత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను చిన్నప్పటినుంచి చదివిన పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి గదిని నా చేతుల మీదుగా ప్రారంభించడం నాకు గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్న ఈ తరుణంలో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, ప్రీ ప్రైమరీ విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.